క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్ష్మణచాంద: విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వడ్యాల్, నర్సాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఖానాపూర్ ఆస్పత్రి సివిల్ సర్జన్‌గా స్వర్ణారెడ్డి



ఖానాపూర్: ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ సర్జన్‌గా డాక్టర్ స్వర్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రిలో విధులు నిర్వహించిన ఆమె పదోన్నతిపై ఖానాపూర్ ఆస్పత్రికి వచ్చారు. వైద్యురాలిని ఆస్పత్రి సిబ్బంది, నాయకులు సన్మానించారు. గర్భిణులు, బాలింతలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజేశ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వీరిది పేద కుటుంబం కావడంతో మే నెల 19న సాక్షిలో 'ఆపన్న హస్తం అందించరూ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పలువురు దాతలు కొంత ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం బాధిత కుటుంబానికి జైజవాన్ జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు లింగన్న, దినేశ్, విజయ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

మైనార్టీలకు చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎంపీపీ కల్పన

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కల్పన 13 మంది మైనార్టీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మైనార్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే ప్రభుత్వం సాయం అందిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గణేశ్, సాయినాథ్, గజ్జారాం ఉన్నారు.

వీవోఏల హర్షం



సీఎం చిత్రపటానికి వీవోఏల క్షీరాభిషేకం

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం వీవోఏ(గ్రామ సంఘాల సహాయకులు)లకు గౌరవ వేతనం పెంచడంతో రూ.ఎనిమిది వేలకు చేరింది. శుక్రవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వీవోఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఆయా గ్రామాల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

అడెల్లిలో బహిరంగ వేలం వాయిదా

సారంగపూర్: అడెల్లి ఆలయ దుకాణ సముదాయాల బహిరంగ వేలంపాటకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో నాలుగు టెండర్లలో మూడు వాయిదా పడగా.. కొబ్బరి కాయలు విక్రయించే హక్కుకు శుక్రవారం టెండర్ పూర్తయినట్లు ఆలయ ఈఓ రవికిషన్ గౌడ్ తెలిపారు. అడెల్లి ఆలయ పరిసరాల్లో టెంటు పాత్రలు కిరాయికి ఇచ్చే హక్కు, ఇడుపుడు పిల్లలు సేకరించే హక్కు, తైబజారు వసూలు హక్కులకు వ్యాపారులు ముందుకు రాలేదు. మూడు వేలం పాటలను రద్దు చేసి త్వరలోనే మళ్లీ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కును జామ్ గ్రామానికి చెందిన అల్లాడి సత్యనారాయణ రూ.17లక్షల 65వేలకు దక్కించుకున్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

తానూరు: మండలంలోని కుప్టి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తానూరు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. వైద్యులు భాస్కర్ మాట్లాడుతూ వ్యాధుల బారిన పడితే తానూరు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. అంత కుముందు పలువురికి వైద్య పరీక్షలు చేసి.. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోశ్, అంగన్‌వాడీ టీచర్ శోభ, బాపురావ్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలతో జలసవ్వడి

- పెరుగుతున్న భూగర్భజలాలు, ఆయకట్టు
- జిల్లాకు మరో 21 చెక్‌డ్యాంలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నిర్మల్‌రూరల్ మండలంలో చిట్యాల్ వద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం

మామడ: వర్షాకాలంలో వాగులు, కాలువల ద్వారా వచ్చే నీటి ప్రవాహాన్ని ఒడిసి పట్టుకునేలా ప్రభుత్వం చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లాలో నిర్మించిన చెక్‌డ్యాంలతో భూగర్భజలాలు, ఆయకట్టు పెరిగి మంచి ఫలితాలు వస్తున్నాయి. దీంతో మరిన్ని నిర్మించేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో మరో 21 చెక్‌డ్యాంలు నిర్మించేందుకు అనుమతులు మంజూరయ్యాయి.

మొదటి విడతలో పూర్తయిన 19 చెక్‌డ్యాంలు..

జిల్లాలోని స్వర్ణవాగు, కనకాపూర్‌వాగు, సుద్దవాగు, కడెం వాగు, కల్లూర్‌వాగు, పెంబి సమీపంలోని వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా 21 చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. వీటికి ప్రభుత్వం రూ.58 కోట్లు విడుదల చేసింది. వీటిలో 19 చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

రెండో విడతలో మరో 21 నిర్మాణాలు..

చెక్‌డ్యాంల నిర్మాణాలు సత్ఫలితాలివ్వడంతో నీటిపారుదలశాఖ అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. దీంతో ప్రభుత్వం రెండో విడతలో 21 చెక్‌డ్యాంలు నిర్మించేందుకు రూ.128.07 కోట్లను మంజూరు చేసింది. త్వరలో టెండర్ ప్రక్రియ చేపట్టి నిధులు మంజూరవగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు.

డ్యాంలు నిర్మించే ప్రాంతాలివే..

- నిర్మల్ నియోజకవర్గంలో ఏడు చోట్ల సోన్ మండలంలోని జాఫ్రాపూర్, లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి, నిర్మల్ మండలంలోని వెంగ్వపేట్, సారంగపూర్ మండలంలోని పాట్యా, తాంద్ర(జి), బోరిగాం, కొట్ల(బి) గ్రామాల్లో డ్యాంలు నిర్మించనున్నారు.
- ముధోల్ నియోజకవర్గంలో తొమ్మిది చోట్ల భైంసా మండలంలోని దేగాం, కామోల్,లోకేశ్వరం మండంలోని పుస్పూర్, పోట్‌పెల్లి, సాథ్‌గాం, కుభీర్ మండలంలోని రాజూరా, కుప్టి, బ్రిద్రెల్లి, ఝరి(బి) గ్రామాల్లో డ్యాంలు నిర్మించనున్నారు.
- ఖానాపూర్ నియోజకవర్గంలో ఐదు చోట్ల పెంబి మండలంలోని పెంబికోసగుట్ట, తాటిగూడ, షెట్‌పల్లి, ఇటిక్యాలతండా, మందపెల్లి గ్రామాల్లోని వాగులపై డ్యాంలు నిర్మిస్తారు.

తీరిన నీటి చింత..

ఈ డ్యాంల నిర్మాణాలతో సమీప ప్రాంతాల్లో పచ్చదనం, భూగర్భజలాలు వృద్ధి చెందినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో వాగుల నుంచి ఇసుకను ఇష్టానుసారం తవ్వి తీసేవారు. దీంతో భూగర్భ జలాలు లోతుకు వెళ్లిపోయేవి. వేసవిలో పశువులు దాహార్తి తీర్చుకునేందుకు, సాగునీటికి కొంత ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం నీటినిల్వతో సమస్యలు తీరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యత పాటించకుంటే వరద ధాటికి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. నీటి ప్రవాహానికి అనుగుణంగా డ్యాం డిజైన్ ఉండాలని.. లేకుంటే చిన్నపాటి వరద వచ్చినా కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందని.. అధికారులు సర్వే చేసిన తర్వాతే పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య తీరింది



మా గ్రామ సమీపంలో స్వర్ణ వాగుపై చెక్‌డ్యాం నిర్మించడంతో భూగర్భ జలాలు పెరిగాయి. కరెంట్ మోటార్ల ద్వారా నీటిని తరలిస్తూ పంటలు పండించుకుంటున్నాం. వేసవిలో పశువుల దాహార్తి కూడా తీరుతుంది.

– శ్యాంరెడ్డి, వంజర్, మం.సారంగపూర్

నిధులు రాగానే ప్రారంభిస్తాం



జిల్లాలో మొదటి విడతలో 19 చెక్ డ్యాంల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రతిపాదనలు పంపడంతో రెండో విడతలో మరో 21 చెక్‌డ్యాంల నిర్మాణాలకు అనుమతి లభించింది. త్వరలో టెండర్లు నిర్వహిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రామారావు, ఈఈ, నీటిపారుదలశాఖ

సీపీఎస్ రద్దు చేయాలని వినతి



లోకేశ్వరంలో వినతిపత్రం అందిస్తున్న నేతలు

భైంసాటౌన్: సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్టీయూ భైంసా మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భైంసాలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణ రావు, మండలాధ్యక్షుడు గజ్జారాం, గోపాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజ్జారాం, పుండ్లిక్, పోతన్న పాల్గొన్నారు.

మామడ: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు.

లోకేశ్వరం: సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందించారు. విధులకు హాజరైన మండలంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సురేశ్‌రావు, దేవేందర్‌రెడ్డి, అశోక్, ప్రభాకర్, రమణారెడ్డి, రోజా, సుమలత, జయసుందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసాలోని గణేశ్‌నగర్‌లో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. పెండెప్ కళావతి దిగంబర్‌కు రూ. 60వేలు, జి.సాయినాథ్‌కు రూ.12వేలు, ప్రవళికకు రూ.18 వేల విలువైన చెక్కులు అందించారు. అనంతరం గణేశ్‌నగర్‌లో నిర్మించే మున్నూరు కాపు కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పి.కృష్ణ, కౌన్సిలర్ రాజేశ్వర్, తోట రాము, సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు ఉన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెంబి: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పెంబి తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని బూత్ కేంద్రాల వద్ద ఓటుహక్కుకు దరఖాస్తు, తప్పులుంటే సవరణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ లచ్చిరాం, ఆర్‌ఐ రాజం, బీఎల్‌వోలు ఉన్నారు.

నేడు, రేపు నమోదు కార్యక్రమం

లోకేశ్వరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని తహసీల్దార్ మోతీరాం తెలిపారు. బీఎల్‌వోలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

అమరవీరుల గుర్తుగా అమృతవాటిక

- గ్రామాల్లో మట్టి సేకరించిన బీజేపీ నాయకులు



కడెం: కొండుకూర్‌లో మట్టిని సేకరిస్తున్న రాంనాథ్



సోన్: గోదావరి మట్టి సేకరిస్తున్న నాయకులు

కడెం: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల గుర్తుగా ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద అమృతవాటిక నిర్మించడం గొప్ప విషయమని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత వాటిక నిర్మాణం కోసం దేశంలో అన్ని ప్రాంతాల నుంచి మట్టి సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి మట్టి సేకరించినట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కిష్టయ్య, గంగాధర్, సత్తన్న, ఆశన్న తదితరులు ఉన్నారు.

గోదావరిలో మట్టి సేకరించిన నాయకులు

సోన్: మండల కేంద్రంలో మేరీ మిట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. స్థానిక గోదావరి నదిలో అనంతరం మట్టిని సేకరించినట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లోని ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన మల్లేశ్ బీజేపీలో చేరారు. గంగారెడ్డి, సరికెల గంగన్న, జమాల్, సత్యం, సాయన్న, రాజు నర్సయ్య, జిక్క ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో మేరీ మిట్టి–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో నిర్మిస్తున్న అమృత వాటికకు గ్రామంలో మట్టి సేకరించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, మండల అధ్యక్షులు టేకు ప్రకాశ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి మట్టిని సేకరించారు. నల్లూరి శ్రీధర్, పెద్ది రమేశ్, సుధాకర్, శంకర్, రవి, దాసరి రాజేశ్వర్, వెంకటేశ్, శేఖర్‌గౌడ్, మహేందర్, విజయ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేటలో బీజేపీ నాయకులు అమృత వాటిక నిర్మాణానికి మట్టి సేకరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాయక్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామ అధ్యక్షుడు రవీందర్, రాముగౌడ్, గంగాధర్, వెంకటేశ్వర్లు, వేణు, శివకుమార్ పాల్గొన్నారు.

నిమజ్జన శోభాయాత్ర మార్గం పరిశీలన



పరిశీలిస్తున్న సీఐ శ్రీను, అధికారులు

భైంసాటౌన్: గణేశుడి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భైంసా పట్టణంలోని పలు వీధుల్లో చేపట్టే నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని పోలీసు, మున్సిపల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై గుంతలు, శిథిల భవనాలు పరిశీలించారు. భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు పూడ్చి వేయాలని సిబ్బందికి సూచించారు. పట్టణ సీఐ ఎల్ శ్రీను, మున్సిపల్ డీఈఈ నాగేశ్వర్ రావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల యువకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం పార్‌పెల్లికి చెందిన 50 మంది, వడ్యాల్‌తండాకు చెందిన పలువురు జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో అట్ల రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

తానూరు: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని భోసి గ్రామంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. గుండ్ల రాజు, నజీర్, భుజంగ్, శ్రీనివాస్ ధోని పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి



జామ్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి



కుభీర్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సారంగపూర్: పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకోవాలన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కోడిగుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాలను ఆహారంగా తీసుకుంటూ ఆహార నియమాలను పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ విజయగౌరి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సరోజ, అమృత, విజయ, పుష్ప, రమ, పద్మ, సావిత్రి తదితరులు ఉన్నారు.

కుభీర్:మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్ సత్యశీల తదితరులున్నారు.

గవర్నర్‌ను కలవనున్న బీజేపీ నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల నిర్మల్‌లో మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పోలీసుల లాఠీచార్జిలో గాయపడ్డ బీజేపీ కార్యకర్తలు, రైతులు శనివారం మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.

వజ్రోత్సవాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు



వేడుకలో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా నేతలు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, లోకేశ్వరం జెడ్పీటీసీ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పుస్తకపఠనంపై అవగాహన కల్పించారు. యూఎస్ ఎయిడ్ రూం టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామూహిక పఠన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ చదవండి..ఆనందించండి కార్యక్రమంలో భాగంగా పఠనంతో చేకూరే ప్రయోజనాలను విద్యార్థులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు వాల్గోట్ శ్రీనివాస్, గట్ల నర్సయ్య, పలువురు సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కోతుల బెడదతో కష్టాలు



ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ఇళ్లలోకి వచ్చి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. చెదరగొట్టేందుకు యత్నిస్తున్న పట్టణవాసులపై దాడులు చేస్తుండటంతో వారు గాయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 78421 50545

సంక్షిప్త వార్తలు

'రెగ్యులర్ డాక్టర్‌ను నియమించండి'

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పీహెచ్‌సీలో సౌకర్యాలున్నా.. డాక్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని.. డాక్టర్‌ను నియమించాలని కోరారు.

నేడు మంత్రి రాక

సారంగపూర్: మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేదలకు ఇంటిస్థలాలు పంపిణీ చేస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, హాజరు కావాలని కోరారు.

సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీలు

కుంటాల: మండలంలోని అందకూర్‌లో శుక్రవారం 35 మంది అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు సీఐటీయూ యూనియన్‌లో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

రక్త నమూనాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామ వడ్డెర కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ రక్త నమూనాలను మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ సేకరించారు. పలువురు జ్వరాల బారిన పడటంతో రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులు అందించారు.

వంతెనకు మరమ్మతులు

పెంబి: ఇటీవలి వర్షాలకు మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామాలకు వెళ్లే మార్గంలో పాలచెలిమె వాగుపై ఉన్న తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. ఈ విషయం తెలిసి శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ పెంబి మండల యువసేన సభ్యులు పొక్లెయిన్ సాయంతో మరమ్మతులు చేపట్టారు. దీంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. సభ్యులు మల్లేశ్, మహేందర్, ధర్మేందర్, గ్రామస్తులు పెద్దయ్య, సర్పంచ్‌లు ఉన్నారు.

కడ్తాల్‌లో పశువైద్య శిబిరం



మాట్లాడుతున్న గంగాధరయ్య

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గంగాధరయ్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందు తాగించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడంతోపాటు పలు పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మహేశ్, వైద్యసిబ్బంది సుప్రియ, నరేశ్, కరుణాకర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ గోపాల్, గోపాలమిత్రలు సురేందర్, భోజన్న పీఏసీఎస్ డైరెక్టర్ దాస్, రాజా రాజన్న, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899